
సాక్షి బాపట్ల

మంగళవారం । 19 । నవంబర్ । 2024



వేంకటేశ్వరునికి విశేష పూజలు

జీఎస్‌పాలెం(కర్లపాలెం): గోకరాజు నల్లిబోయి నవారిపాలెంలో కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తిక పూజలు జరిగాయి. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.



భక్తిశ్రద్ధలతో దీపోత్సవం

మంగళగిరి: పట్టణంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం)లో కార్తిక సోమవారం సందర్భంగా కోటి దీపోత్సవం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్తిక పూజలు



చుండూరు(వేమూరు): చుండూరు మండలం చినపరిమిలోని రామ లింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక సోమవారం పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా చిరుద్యోగులపై కత్తి

- జిల్లాలో 173 మందికిపైగా వీవోఏల తొలగింపు
- పదేళ్లుగా ఉద్యోగాలు చేసుకుంటున్న మహిళలు
- కూటమి అధికారంలోకి రాగానే పార్టీ ముద్రవేసి కక్షసాధింపులు
- మంత్రుల నియోజకవర్గాల్లోనే అత్యధిక ఉద్యోగాల తీసివేతలు
- చిరుద్యోగుల సంక్షేమానికి వైఎస్ జగన్ సర్కారు కృషి

సాక్షి ప్రతినిధి,బాపట్ల: చిరుద్యోగులపై కూటమి సర్కారు కత్తిగట్టింది. పార్టీ ముద్రవేసి తొలగింపులు దిగుతోంది. కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఫలితంగా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఇటీవల 173 మందికిపైగా వీవోఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)లను సర్కారు నిర్దాక్షిణ్యంగా తొలగించింది. దీంతో వీవోఏలు జె.పంగులూరు వెలుగు కార్యాలయం వద్ద ఇటీవల 24 గంటల నిరసన దీక్ష చేపట్టారు. పొదుపు సంఘాల మహిళల పద్దులు రాయడం, ప్రభుత్వం ఇచ్చే పథకాలను తెలియచేయడం, బ్యాంకులనుంచి రుణాలు ఇప్పించడం, చెల్లింపుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయడం వీవోఏల విధి. ఇంతా చేసినా వారికి నెలకు అందేది రూ.8వేలు మాత్రమే. అయినా ఈ చిరుద్యోగులపై టీడీపీ నేతలకు కన్నుకుట్టింది. పార్టీ ముద్రవేసి ఇప్పటికే చాలామందిని తొలగించారు. మరికొందరిని తొలగించేందుకు సిద్ధమయ్యారు. టీడీపీ నేతలు చెప్పిందే తడవుగా వెలుగు కార్యాలయాల్లో పనిచేస్తున్న ఏపీఓలు వీవోఏలను తొలగిస్తున్నారు.

వీవోఏలపై జగన్ ప్రభుత్వం సానుకూలత

పదేళ్లకుపైగా వీవోఏలు ఉద్యోగాలు చేసుకుంటున్నా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారి జోలికెళ్లలేదు. వారిని ఏ పార్టీ అని అడగలేదు. తమ పార్టీ కాదని ఉద్యోగం నుంచి తొలగించలేదు. తప్పులు జరిగిన చోట్ల ఒకరిద్దరిని మాత్రమే తొలగించిన ఘటనలు ఉన్నాయి తప్పించి పార్టీలు చూసి ఉద్యోగాలు పీకేసిన పరిస్థితి లేదని వీవోఏలే పేర్కొంటుడడం గమనార్హం. పైగా వారి సంక్షేమానికి గత సర్కారు కృషి చేసింది.

మొత్తం 1,031 మంది వీవోఏలు

జిల్లాలో 33,374 డ్వాక్రా గ్రూపులు ఉండగా వీటి పరిధిలో 1,031 మంది వీవోఏలు పనిచేస్తున్నారు. ఎక్కువమంది 2013 నుంచి ఇప్పటివరకూ విధుల్లో ఉన్నారు. తమ పని తాము చేసుకుంటున్నారు. లక్షలాదిమంది మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారు. కూటమి సర్కారు వచ్చినప్పటి నుంచే వీరిపై కక్షకట్టింది. విధుల నుంచి తొలగిస్తోంది.

కూటమి నేతలు చెబితే సరి!

కూటమి నేతలు చెబితే తిరిగి విధుల్లోకి తీసుకుంటామని ఏపీవోలు చెబుతున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని వీవోఏలు ధ్రువీకరిస్తున్నారు. ధ్రువీకరిస్తున్నారు.

టీడీపీ నేతల దురాగతం



జె. పంగులూరు వెలుగు కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టిన వీవోఏలు (ఫైల్)

మంత్రి గొట్టిపాటి ఇలాకాలో 51 మంది తొలగింపు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న అద్దంకి నియోజకవర్గంలో అత్యధికంగా 51 మంది వీవోఏలను తొలగించారు. జె.పంగులూరు మండంలో మొత్తం 38 మందికి గాను ఇప్పటివరకూ 18 మందిని తొలగించగా అద్దంకి, సంతమాగులూరు మండలాల్లో తొమ్మిది మంది చొప్పున 18 మందిని, మేదరమెట్లలో 8 , బల్లికురవలో 7 మందిని తొలగించారు.

- అలాగే రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ నియోజకవర్గం రేపల్లెలో నగరం మండలంలో 18 మందిని, నిజాంపట్నంలో 11, చెరకుపల్లిలో 13, రేపల్లెలో 7గురిని మొత్తం 49 మందిని తొలగించారు.
- పర్చూరు నియోజకవర్గంలో మార్టూరులో 11 మందిని, యద్దనపూడిలో 9, పర్చూరు 7, చినగంజాం 6,ఇంకొల్లులో 6, కారంచేడులో నలుగురిని మొత్తం 43 మందిని తొలగించారు.
- మాజీమంత్రి నక్కా ఆనందబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న వేమూరు నియోజకవర్గంలో చుండూరు మండలంలో 12 మందిని, భట్టిప్రోలు 7, కొల్లూరు 6, వేమూరు 4, అమృతలూరులో ఒకరిని మొత్తం 36 మందిని తొలగించారు.



రాత్రి వేళా వెలుగు కార్యాలయం వద్దే పడుకున్న వీవోఏలు (ఫైల్)

- చీరాల, బాపట్ల తదితర ప్రాంతాల్లోనూ కొంద మందిని తొలగించినట్లు తెలుస్తున్నా వెలుగు అధికారులు సమాచారం చెప్పడానికి నిరాకరిస్తున్నారు. అసలు జిల్లాలో ఎంతమందిని తొలగించారో అన్న సమాచారం తమ దగ్గర ఉండదని వెలుగు జిల్లా అధికారులు చెప్పడం గమనార్హం. విధుల్లో నుంచి తొలగించడంతో పలువురు వీవోఏలు కోర్టునూ ఆశ్రయించారు.

వీవోఏల ఆవేదన

2014 నుంచి పనిచేస్తున్న అద్దంకి మండలం కలువకూరుకు చెందిన స్వాతిని ఇటీవల తొలగించారు. ఎటువంటి ఫిర్యాదులూ లేకుండా ఉద్యోగం నుంచి ఎలా తొలగిస్తారంటూ ఆమె ప్రశ్నిస్తోంది. కేవలం రాజకీయంగా స్థానికుల ఫిర్యాదు తీసుకొని అధికారులు తొలగించడం సరికాదని అద్దంకి మండలానికి చెందిన శారద, బల్లికురవ మండలం వేమవరానికి చెందిన భవాగ్ని, జె.పంగులూరు మండలం కొండమూరుకు చెందిన సావిత్రి, ఇదే మండలానికి చెందిన హేమతో పాటు పలువురు వీవోఏలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. ఇటీవల జె.పంగులూరు మండలంలో వీవోఏలు ఆందోళన బాటపట్టి పలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా తొలగించబడిన వీవోఏలందరూ ఏకమై కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.

న్యూస్‌రీల్

రాయితీపై మినీ ట్రాక్టర్లు



ప్రత్తిపాడు: రాయితీపై రైతులకు మినీ ట్రాక్టర్లు అందించనున్నట్లు ప్రత్తిపాడు మండల ఉద్యాన అధికారి ఎం.బేబి తెలిపారు. కాకుమాను మండలం కొండపాటూరుకు చెందిన కుర్రాకుల ప్రసాద్‌కు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఉద్యాన యాంత్రీకరణ పథకం కింద ట్రాక్టర్‌ను అందించారు. ఈ సందర్భంగా హెచ్‌వో బేబి మాట్లాడుతూ ట్రాక్టర్ ధర రూ.5.25 లక్షలని, ఇందులో ప్రభుత్వ రాయితీ రాయితీ లక్ష ఉంటుందని చెప్పారు. మిగిలిన రూ.4.25 లక్షలు రైతులు తమ వాటాగా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

టెన్త్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు


గుంటూరు ఎడ్యుకేషన్: వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫీజును ఎటువంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించేందుకు తుది గడువును ఈనెల 26 వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ ఆదేశాల మేరకు అన్ని యాజమాన్యాల్లోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంబంధిత విద్యార్థుల పరీక్ష ఫీజును ఈనెల 26లోపు రూ.125 చొప్పున చెల్లించి, నామినల్ రోల్స్‌తోపాటు ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. రూ.50 అపరాధ రుసుంతో కలిపి చెల్లించేందుకు డిసెంబర్ 2, రూ.200తో చెల్లించేందుకు డిసెంబర్ 9, రూ.500తో చెల్లించేందుకు డిసెంబర్ 16 వరకు అవకాశముందని వివరించారు.

కలెక్టరేట్ ఎదుట ఆశ కార్యకర్తల ధర్నా



గుంటూరు వెస్ట్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఏపీ ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేస్తున్న తమకు ఇంకా చాలీచాలని జీతాలే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలో పని భారం బాగా పెరిగిందని ఆరోపించారు. తమకు జీతభత్యాలతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్ ప్రభుత్వమే కల్పించాలని కోరారు. కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమకు కుటుంబం ఉంటుందని, సెలవులు ఇవ్వాలని విన్నవించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 3800 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు162, బ్యాంక్ కెనాల్‌కు 825, తూర్పు కెనాల్‌కు 50, పశ్చిమ కెనాల్‌కు 93, నిజాంపట్నం కాలువకు 209, కొమ్మమూరు కాలువకు 2001 క్యూసెక్కులు విడుదల చేశారు.

దుర్గమ్మకు వెండి కిరీటం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువున్న కనకదుర్గమ్మకు ద్రాక్షారామంకు చెందిన భక్తులు వెండి కిరీటాన్ని సమర్పించారు. ద్రాక్షారామానికి చెందిన కొమ్ముల స్వామినాయుడు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. సుమారు రూ. 1.30 లక్షలతో 1.300 కిలోల వెండితో కిరీటాన్ని తయారు చేయించి సోమవారం ఆలయ అధికారులకు అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా ఆలయ పర్యవేక్షకుడు రమేష్ దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన



బాపట్ల టౌన్: గిరిజన బిడ్డల అభ్యున్నతి కోసం ఆహర్నిశలు శ్రమిస్తున్న తమపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపుతోందని గిరిజన సంక్షేమ గురుకులం అవుట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షులు ఎన్.పర్మేష్ తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేశారు. పర్మేష్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఎక్కడా కూడా ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉపాధ్యాయులు లేరని, గిరిజన సంక్షేమ శాఖలో మాత్రమే ఉన్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్‌గా మార్పు చేసి 2022 పీఆర్సీ ప్రకారం జీతభత్యాలు చెల్లించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు జె. రామాంజనేయులు, సీహెచ్. ఏడుకొండలు, టి. చంటి, ఎ. రాజు పాల్గొన్నారు.

యార్డుకు 43,853 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 43,853 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 38,919 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 15,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

- ప్రతి నెలా 3వ శుక్రవారం దివ్యాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్
- 4వ శుక్రవారం ఎస్టీల కోసం..
- అధికారుల సమీక్షలో కలెక్టర్ వెంకట మురళి

బాపట్లటౌన్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ వెంకట మురళి మాట్లాడుతూ దివ్యాంగులు క్యూలో నిలబడి ఇబ్బందులు పడకుండా వారి కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. ప్రతి నెల మూడో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు కలెక్టరేట్లో గ్రీవెన్స్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రతి నెలా నాలుగో శుక్రవారం కేవలం ఎస్టీల కోసం మాత్రమే గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. దివ్యాంగులు, గిరిజనుల సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా అధికారులంతా హాజరు కావాలన్నారు. అదే రోజు మండల స్థాయి, డివిజన్ స్థాయి అధికారులంతా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందుబాటులో ఉండాలన్నారు. అర్జీలను సాధ్యమైనంత త్వరగా అధికారులు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశిత గడువులోపు అర్జీలు పరిష్కరించాలన్నారు. ఆధార్ కార్డులు లేని ఎస్టీల సర్వే మరింత పక్కాగా నిర్వహించాలన్నారు. చీరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద తోపుడుబండ్లపై వ్యాపారం చేసుకుంటున్న 18 నక్కల కుటుంబాల జీవనోపాధికి ఆటంకం కలిగించవద్దని, వారికి రాత్రుళ్లు ఆశ్రయం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసు ఛేదించిన పోలీసులు

- ఆరుగురు నిందితుల అరెస్టు, రెండు కార్లు సీజ్
- నిందితులందరూ తెలంగాణ వారే
- పోలీసులను అభినందించిన ఎస్పీ
- వివరాలను వెల్లడించిన చీరాల డీఎస్పీ మొయిన్

చినగంజాం: కిడ్నాప్ కేసును పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించి నిందితులను కటకటాల్లోకి నెట్టారు. చినగంజాం పోలీస్ స్టేషన్‌లో చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బేతాళ వారిపాలెం గ్రామానికి చెందిన పిల్లివెంకట కృష్ణారావు ఫారెక్స్ మార్కెట్‌లో ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తుంటాడు. ఈనెల 17న ఆదివారం ఉదయం సుమారు 6.30 గంటలకు హైదరాబాద్ నుంచి రెండు కార్లలో వెంకట కృష్ణారావు ఇంటికి కొంత మంది వ్యక్తులు వచ్చారు. తమను రియాజ్ పంపించాడని చెప్పి అతనికి ఇవ్వాల్సిన నగదు ఇవ్వాలని భయపెట్టి అతని ల్యాప్ టాప్, మొబైల్ ఫోను లాక్కొని బలవంతంగా అతనిని కారులో ఎక్కించుకొని బైపాస్ రోడ్డులో వెళ్లిపోయారు. దీనిపై కృష్ణారావు బంధువు బెజ్జం హరికృష్ణ చినగంజాం ఎస్‌ఐ శీలం రమేష్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని ఎస్పీ తుషార్ డూడీకి సమాచారమిచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య ఆధ్వర్యంలో ఎస్సై తన సిబ్బంది ఒక బృందంగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. చినగంజాం టోల్‌గేటు వద్ద కార్ల వివరాలు తెలుసుకొని సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేసు దర్యాప్తు ప్రారంభించి కొద్ది గంటల్లోనే ఆరుగురు నిందితులను గుర్తించి వారిని అరెస్టు చేశారు. అరెస్ట్ చేసిన వారిలో అందరూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు కాగా వారిలో రంగారెడ్డి జిల్లాకు చెందిన గుర్రం ఆనంద్ కుమార్, కరణ్‌కోటి కల్కి, నాగం నరేందర్, బొల్లారం ఉమేష్ రెడ్డి, శ్రీపాద కిరణ్‌కుమార్, హైదరాబాద్‌కు చెందిన జేడ్డోజి సాయికుమార్ ఉన్నారు. ప్రధాన నిందితుడు రియాజ్ పరారీలో ఉన్నట్లు, గాలింపు జరుపుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. వారి నుంచి రెండు కార్లు, ఒక ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్‌ను దర్యాప్తు నిమిత్తం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్

ఫేస్ బుక్ పరిచయంతో మొదలు

పిల్లి వెంకట కృష్ణారావుకు, హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ రియాజ్‌లకు ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైంది. వీరిద్దరు ఫారెక్స్ మార్కెట్‌లో ఆన్‌లైన్ వ్యాపారం చేస్తారు. మార్కెట్‌లో వచ్చే ఒడిదుడుకులను గురించి మాట్లాడుకునేవారు. ఈ నేపథ్యంలో రియాజ్ అకౌంట్‌లో డాలర్లను లావాదేవీలను పిల్లి వెంకట కృష్ణారావు తన అకౌంట్‌లోకి మార్చుకున్నాడని, రియాజ్ పలుమార్లు అడిగినా కృష్ణారావు ఎటువంటి సమాధానం ఇవ్వక పోవడంతో రియాజ్ తన స్నేహితుడు ఆనంద్ కుమార్‌కు చెప్పాడు. ఆనంద్‌కుమార్ స్నేహితులతో కలిసి కృష్ణారావు దగ్గరకు వెళ్లి అతనితో మాట్లాడి వస్తామని చెప్పి ఈనెల 16వ తేదీ రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరి 17వ తేదీ ఆదివారం సుమారు 6.30 గంటల ప్రాంతంలో కృష్ణారావును కిడ్నాప్ చేసుకొని తీసుకెళ్లారు.

పోలీసులు, సిబ్బందిని అభినందించిన ఎస్పీ

కిడ్నాప్ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్, ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, చినగంజాం ఎస్‌ఐ శీలం రమేష్, ఏఎస్‌ఐ జీ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ డీ శ్రీనివాసరావు, హోం గార్డు నాగరాజును ఎస్పీ అభినందించారు. పోలీసులు వేగంగా స్పందించి గంటల వ్యవధిలో కిడ్నాప్ కేసు ఛేదించి బాధితుడిని రక్షించి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చడంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

రిలే నిరాహార దీక్షకు దిగిన 108 ఉద్యోగులు



జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు దీక్ష నిర్వహిస్తున్న 108 ఉద్యోగులు

బాపట్ల టౌన్: అత్యవసర సేవలందించే తమకు అవస్థలు తప్పడం లేదని 108 ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ పి. హరిబాబు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. హరిబాబు మాట్లాడుతూ 108 సర్వీస్‌లను ప్రభుత్వమే నిర్వహించాలని, సిబ్బందిని ప్రభుత్వ వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. రోజుకు మూడు షిఫ్ట్‌ల్లో ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వ నియామకాల్లో 108 ఉద్యోగులకు వెయిటేజ్ మార్కులు అందించాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో చేపడుతున్న ఈఎంటీ పోస్టుల నియామకాల్లో 108లో పనిచేస్తున్న వారిని నియమించాలని కోరారు. జీవో నంబర్ 49 ప్రకారం ప్రతి నెలా ఉద్యోగికి రూ. 4 వేలు అందించాలని విన్నవించారు. ప్రస్తుత నిర్వహణ సంస్థ అరబిందో ఈఎంఎస్ నుంచి ఉద్యోగులకు రావాల్సిన బకాయిల చెల్లింపుల బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని కోరారు. చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు రూ. 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ జి. చందు, ట్రెజరర్ కె. కోటయ్య, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

150 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు

జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

బాపట్లటౌన్: జిల్లాలో 150 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ మీటింగ్ హాల్‌లో ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ 2024–25 ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాలోని 300 రైతు సేవ కేంద్రాలను 150 క్లస్టర్ పాయింట్లుగా ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో గ్రేడ్–ఏ రకానికి క్వింటాలుకు రూ.2,320, సాధారణ రకానికి క్వింటాలుకు రూ.2,300 చెల్లించనున్నట్టు చెప్పారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోతాలు వాహనాలలోకి ఎక్కించటానికి కూలీలకు ఇవ్వాల్సిన హమాలి ఖర్చు, మిల్ పాయింట్‌కు చేర్చటానికి అయ్యే రవాణా ఖర్చును కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఒకవేళ రైతులు ఆ ఖర్చును భరించినట్లయితే, ఖర్చు చేసిన సొమ్ము మొత్తం నేరుగా రైతు బ్యాంకు ఖాతాలోకి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు జమచేస్తామన్నారు. ధాన్యం జీపీఎస్ అమర్చిన వాహనాల్లో మాత్రమే రవాణా చేయాలన్నారు.

ఇద్దరు హాస్టల్ విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థినుల పట్ల సిబ్బంది దుష్ప్రవర్తన, అసభ్య ప్రవర్తన, వేధింపులకు ఆస్కారం లేకుండా చూడాలని హైకోర్టు స్పష్టంగా నిర్దేశించి నాలుగు రోజులైనా గడవకముందే.. సిబ్బంది వేధింపులతో ఇద్దరు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన సంచలనం కలిగించింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహంలో ఇద్దరు ఇంటర్ విద్యార్థినులు ఉసురు తీసుకోబోయారు. వార్డెన్, సిబ్బంది వేధింపులు, తోటివిద్యార్థినుల ముందు అవమానకరంగా మాట్లాడటాన్ని తట్టుకోలేక వారు ఆదివారం రాత్రి వారు ఆత్మహత్యాయత్నం చేశారు. అధికసంఖ్యలో డోలో–650 మాత్రలు మింగిన వారు ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో కోలుకుంటున్నారు. సత్తెనపల్లిలోని వెంకటపతినగర్‌లోగల ఈ హాస్టల్లో 297 మంది విద్యార్థినులు ఉంటున్నారు. ఈ నెల 15న మధ్యాహ్నం మిగిలిన అన్నాన్ని రాత్రి వడ్డించడంతో ఇంటర్ విద్యార్థినులు సంగం అఖిల, అన్నవరపు సనిత ప్రశ్నించారు. దీంతో హాస్టల్ వార్డెన్ రాణెమ్మ, వంట సిబ్బంది వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సనితపై దాడికి యత్నించారు.

వార్డెన్‌కు కౌన్సెలింగ్‌తో సరిపెట్టిన పోలీసులు

ఈ నెల 16న హాస్టల్‌కు వచ్చిన తల్లిదండ్రులకు సనిత ఈ విషయం చెప్పడంతో వారు మిగిలిన విద్యార్థినులతో సంతకాలు చేయించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వార్డెన్ రాణెమ్మను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఆదివారం కూడా అఖిల, సనితలను వార్డెన్, సిబ్బంది అవమానించారు. దీన్ని తట్టుకోలేక వారిద్దరు మాత్రలు మింగారు. ఆదివారం రాత్రి అస్వస్థతకు గురైన వారిని వార్డెన్ రాణెమ్మ సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.



సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ప్రాథమిక చికిత్స పొందుతున్న విద్యార్థినులు

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

రేపల్లె రూరల్: రేపల్లె రెవిన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 46 రేషన్ డీలర్లు, 3 బై ఫరగేషన్ దుకాణాల భర్తీకి కలెక్టర్ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడారు. రేపల్లె పట్టణ, మండలంలో 8, నగరంలో 8, చెరుకుపల్లిలో 6, నిజాంపట్నంలో 5, అమర్తలూరు 3, కొల్లూరు 3, వేమూరు 3, భట్టిప్రోలు 5, చుండూరులో 8 పోస్టుల చొప్పున ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. 29న దరఖాస్తుల పరిశీలించి అదేరోజు అర్హులైన వారి జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఎంపికైన వారికి 30న హాల్‌టికెట్స్ జారీ చేసి, డిసెంబర్ 2న పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. 3న పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల జాబితా ప్రచురణ, 5న ఇంటర్వ్యూలు, 6న అర్హుల తదిజాబితాను ప్రకటిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఇంటర్మీడియట్, 10వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్లు, వయస్సు ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం (ఓటర్, ఆధార్, పాన్‌కార్డు ఏదైనా), మూడు పాస్‌ఫోటోలు, కుల ధ్రువీకరణ, నిరుద్యోగిగా ఉన్నట్లు స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేయాలని తెలిపారు. దివ్యాంగుల కేటగిరికి చెందిన వారైతే సంబంధిత సర్టిఫికెట్లు జత చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

రేపు బాపట్లలో జాబ్ మేళా

బాపట్ల టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 20న బాపట్ల జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. ప్రణయ్ తెలిపారు. జాబ్ మేళాకు ఇలాగిరీ సర్వీసెస్ ,ఫైరడేల్ క్యాపిటల్ ,ధరణి రియల్ ఎస్టేట్స్ , సూర్య సంస్థలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. 100కి పైగా ఖాళీలు ఉన్నాయని, జీతం విద్యార్హతను బట్టి సుమారు రూ. 10,000 నుంచి 20,000 వరకు ఉంటుందని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, బీఎస్సీ, ఎంఎస్సీ (కెమిస్ట్రీ), ఎంబీఏ, పీజీ చేసిన 18–30 మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. రెస్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ , ఆధార్ ఫొటోస్టాట్, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ 9988853335, సెల్ నెంబర్ 9640695229 సంప్రదించాలని తెలిపారు. తొలుత httpr://naipunyam.ap.gov.in/ వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ఆశా వర్కర్లపై వేధింపులు తగ్గించాలి



కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

- యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి. ధనలక్ష్మి
- కలెక్టరేట్ ముందు ఆందోళన

బాపట్ల టౌన్: ఆశా వర్కర్లను మానసికంగా వేధింపులకు గురి చేయటం సరికాదని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి. ధనలక్ష్మి తెలిపారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమశాఖ అధికారులు, యూనియన్ నాయకులతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల ప్రకారం వెంటనే జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయస్సు 60 నుంచి 62 పెంచుతామని చెప్పి నేటి వరకు అమలు చేయలేదని, బెనిఫిట్స్ కూడా అందించడం లేదని తెలిపారు. కనీసం ఒక గంట పర్మిషన్ కావాలన్నా, అత్యవసరమైన రోజు సెలవు పెట్టాలన్నా అధికారుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సులవు కావాలంటే ప్రత్యామ్నాయంగా వేరొకరితో ఒప్పందం చేయిస్తేనే ఇస్తామంటూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. కొత్త రికార్డుల నిర్వహణ ఏప్రియల్ 1 నుంచి నిర్వహించాల్సి ఉండగా, నేటి వరకు వాటిని అందజేయలేదని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటమురళీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వరమ్మ, కోశాధికారి వి. వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

ఎస్పీ తుషార్ డూడీ



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల టౌన్: సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ తుషార్‌డూడీ అధికారులకు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 33 మంది బాధితులు హాజరయ్యారు. నేరుగా ఎస్పీని కలిసి సమస్యలు విన్నవించుకున్నారు. ఆయన జిల్లాలోని పోలీస్ అధికారులతో మాట్లాడారు. బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు తదితర సమస్యలతో కూడిన అర్జీలు అధికంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, పీజీఆర్ఎస్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏ. ఝాన్సీరాణి



జేసీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

బాపట్ల టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏ. ఝాన్సీరాణి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఝాన్సీరాణి మాట్లాడుతూ అంగనవాడీ మినీ సెంటర్లను మెయిన్‌గా మార్చాలని కోరారు. సెంటర్ల నిర్వహణలో వర్కర్ పని, హెల్పర్ పని ఒక్కరే చేయడం వల్ల పని భారం పెరుగుతోందని తెలిపారు. మినీ వర్కర్‌కు ప్రమోషన్ ఇవ్వాలని జీవో ఉన్నా, సక్రమంగా అమలు కావడం లేదని చెప్పారు. అత్యవసరమైనప్పుడు కూడా మినీ వర్కర్లకు సెలవులు కూడా ఇవ్వడం లేదన్నారు. కనీసం వేసవి సెలవులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలు అనుగుణంగా వేతనాలు అందించాలని కోరారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్‌గా మార్చాలని గతంలో 42 రోజుల సమ్మె సమయం సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి. సీతామహాలక్ష్మి, ఎస్. హేమమాలిని,బుజ్జి రత్నకుమారి, శివపార్వతి, వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్. మజుందార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు

- గ్రామ, పట్టణ స్థాయిలో పార్టీ కొత్త కమిటీలు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కొత్త కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు హాల్‌లో నియోజకవర్గ సమన్వయకర్తలు, ముఖ్య నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ గతంలో ఉన్న జిల్లా పార్టీ, మండల పార్టీ కమిటీలు, జిల్లా మండల అనుబంధ విభాగాల కమిటీలు, పార్టీ మండల, పట్టణ అధ్యక్షుల కమిటీలు, గ్రామ కమిటీలను రద్దు చేస్తూ వారి స్థానంలో కొత్తవారిని నియమిస్తామని అన్నారు. క్లస్టర్ల జేసీఎస్, జిల్లా మండల అధ్యక్షులు పూర్తిగా రద్దు చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతానికి జిల్లా పార్టీ కమిటీకి సంబంధించి ప్రతి నియోజకవర్గం నుంచి ఒక ఉపాధ్యక్షులు, ఇద్దరు ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ఇద్దరు యాక్టివిటీ సెక్రటరీ, ఒక అధికార ప్రతినిధి పేర్లను పంపవలసినదిగా నియోజకవర్గాల సమన్వయకర్తలను ఆయన కోరారు. 26 జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను కూడా త్వరలో నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, నియోజకవ్గం సమన్వయకర్తలు అన్నాబత్తుని శివకుమార్, షేక్ నూరి ఫాతిమా, దొంతిరెడ్డి శంకర్ రెడ్డి (వేమారెడ్డి), వనమా బాల వజ్రబాబు, బాలసాని కిరణ్ కుమార్, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాలయ రాజనారాయణ పాల్గొన్నారు.

వేధింపులు ఆపకపోతే మేమూ కొనసాగిస్తాం

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- సబ్‌జైలులో ఉన్న నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలకు పరామర్శ



సబ్‌జైలు వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తుందని, రాబోయే రోజుల్లో తాము అధికారంలోకి వస్తే వారు చూపించిన మార్గంలోనే తామూ నడుస్తామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక సబ్‌జైలు రిమాండ్‌లో ఉన్న సోషల్ మీడియా కార్యకర్తలు, చిరుమామిళ్ల గ్రామ నాయకుడు సింగారెడ్డి కోటిరెడ్డిని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, న్యాయవాది చిట్టా విజయభాస్కరరెడ్డి, నకరికల్లు పార్టీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డిలతో కలిసి పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే పోస్టుపై వివిధ పోలీసుస్టేషన్లో అనేక కేసులు పెట్టించి, అరెస్టులు చేస్తూ చిత్రహింసలు పెట్టి జైళ్లకు తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సత్తెనపల్లికి చెందిన పాలూరి రాజశేఖరరెడ్డి అనే సోషల్ మీడియా కార్యకర్త 16 నెలల కిందట పెట్టిన పోస్టుపై నూజివీడులో ఒక కేసు, నకరికల్లులో మరో కేసు పెట్టి చిత్రహింసలు పెడుతున్నారని అన్నారు. పెద్దిరెడ్డి సుధారాణిపై శ్రీకాకుళంలో ఒక కేసు, నరసరావుపేటలో మరో కేసు, మళ్లీ ఈ రోజు చీరాల తీసుకొని వెళ్లారన్నారు. ఆమెపై నాలుగు పీటీ వారెంట్లు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. చిరుమామిళ్ల గ్రామంలో సింగారెడ్డి కోటిరెడ్డిని అరెస్టు చేశారని, ఆయన ఎంపీడీవోపై దాడి చేశాడని తప్పుడు ఆరోపణలతో ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టారన్నారు. ఆయన ఎంపీడీవోను దూషించ లేదని అన్నారు. దానికి సంబంధించిన వీడియో కూడా వైరల్ అవుతుందని అన్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నకరికల్లు మండలంలో గతంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మంత్రులను దూషించినా ఆయనపై ఎటువంటి కేసులు పెట్టలేదని చెబుతూ అప్పుడు అయ్యన్నపాత్రుడు మాట్లాడిన మాటలను సెల్ ద్వారా విలేకర్లకు విన్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, మండల ఉపాధ్యక్షుడు వెంకటప్పరెడ్డి, యన్నం రాధాకృష్ణారెడ్డి, గంటినపాటి గాబ్రియల్, గుండాల వెంకటేష్, భూదాల కళ్యాణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

తెనాలిరూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెనాలి రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు.. సుమారు 30 నుంచి 33 ఏళ్ల మధ్య వయసున్న యువకుడు సోమవారం మధ్యాహ్నం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు లేత నీలం రంగు జీన్సు ప్యాంటు, లేత కాషాయ రంగు చొక్కా ధరించి ఉన్నాడు. స్టేషన్ మేనేజర్ నుంచి వచ్చిన సమాచారం మేరకు జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపారు.

రైల్వే ట్రాక్ వెంబడి గుర్తు తెలియని మృతదేహం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి కృష్ణాకెనాల్ జంక్షన్ సమీపంలో గుర్తుపట్టని మృతదేహాన్ని రైల్వే పోలీసులు సోమవారం గుర్తించారు. గుంటూరు జీఆర్పీ సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. కృష్ణాకెనాల్ జంక్షన్ పరిధిలోని పోల్ నంబర్ 425/30ఎ, మరియు 425/32బి పోల్ మధ్య రైల్వే ట్రాక్ పక్కనే మృతదేహం పడి ఉందని, ఉదయం వచ్చిన సమాచారం మేరకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా పూర్తిగా కుళ్లిపోయి ఉందని, మృతుడి వయస్సు 35–40 మధ్య ఉండవచ్చని, మృతుడి ఒంటిపై తెలుపు వంకాయరంగు గీతలు కలిగిన ఫుల్‌హ్యాండ్ చొక్కా, నలుపు రంగు ఫ్యాంటు, హాఫ్‌హ్యాండ్ బనీన్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే 8328018787 లేదా 0863–2220738కి ఫోన్ చేయాలని ఆయన కోరారు.

తుళ్లూరు స్టేషన్‌లో అనిల్‌కుమార్ విచారణ

తాడికొండ: తుళ్లూరు పోలీసు స్టేషన్‌కు బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను విచారణ నిమిత్తం సోమవారం తీసుకొచ్చారు. మంగళగిరి కోర్టు ఆదేశాల మేరకు.. విచారణ నిమిత్తం స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారించి తిరిగి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబంపై దాడి

ఉద్యోగానికి రాజీనామా చేయాలంటూ బెదిరింపులు



బెల్లంకొండ: మా ప్రభుత్వం వచ్చింది... మా వాళ్లే అంగన్‌వాడీ ఉద్యోగం చేయాలి.. మర్యాదగా ఉద్యోగానికి రాజీనామా చేయి.. లేకపోతే నీ అంతు చూస్తాం.. అంటూ అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబంపై దాడికి దిగిన ఘటన మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితురాలు మన్నెసుల్తాన్‌పాలెం అంగన్‌వాడీ కార్యకర్త మాటూరి బుజ్జి తెలిపిన వివరాలు... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉద్యోగానికి రాజీనామా చేయాలని గ్రామానికి చెందిన నాయకులు వేధింపులకు గురి చేస్తున్నా రు. ఇప్పటివరకు నాలుగుసార్లు కలెక్టరేట్‌లో ఆమెపై ఫిర్యాదు చేశారు. స్థానిక ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి విచారణ చేపట్టారు. ఎన్నిసార్లు విచారణకు వచ్చినా తనపై లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు అందలేదు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు రెండు రోజుల నుంచి బెదిరింపులకు గురిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం ఇంట్లోకి వచ్చి ఉద్యోగానికి రాజీనామా చేస్తావా లేదా అంటూ అంగన్‌వాడీ కార్యకర్త, ఆమె భర్త చిట్టిబాబుపై దాడికి పాల్పడ్డారు. విషయాన్ని ఫోన్ ద్వారా బెల్లంకొండ ఎస్ఐకి తెలియజేయగా కానిస్టేబుల్‌ను పంపారు. వారి సహాయంతో పోలీస్‌స్టేషన్ వెళ్లి ఫిర్యా దు చేసింది. టీడీపీ నాయకుల నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకుంది. అంగన్‌వాడీ కార్యకర్త కుటుంబం తమపై దాడి చేశారంటూ టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఇద్దరి ఫిర్యాదు లు విచారిస్తున్నామని ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

మామ, బావ అసభ్య ప్రవర్తనపై ఫిర్యాదు

నగరంపాలెం: మామ, బావ అసభ్య ప్రవర్తనపై కోడలు సోమవారం ఫిర్యాదు చేసింది. మామ వక్రబుద్ధిపై గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందించింది. ఈ సందర్భంగా బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు మీడియాతో మాట్లాడారు. గుంటూరు రూరల్ గ్రామానికి చెందిన యువతికి తుళ్లూరు మండలానికి చెందిన యువకుడితో గతేడాది నవంబర్‌లో పెళ్లైంది. మొదట్లో కాపురం సజావుగా సాగినా అత్తారింటి నుంచి వేధింపులు మొదలయ్యాయి. అధిక కట్నం తేవాలని ఒత్తిడి తీసుకొచ్చేవారు. భర్త విజయవాడలోని ఓ కారు షోరూంలో పనికి వెళ్లేవాడు. ఇదే అదునుగా భావించిన మామ కోడలిపై కన్నేశాడు. ఒంటిపై చేతులేస్తూ అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయమై భర్త, అత్త దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేదు. ఆఖరికి బావ కూడా వెనుక నుంచి పట్టుకునేవాడు. వరస ఘటనలపై ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించేవారు. తల్లిదండ్రులకు దృష్టికి తీసుకెళ్లగా, పుట్టింటికి తీసుకొచ్చారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదు. కట్నంతోపాటు శారీరకంగా మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన భర్త, అత్త, మామ, బావపై చర్యలు తీసుకోవాలని అర్జీలో కోరినట్లు చెప్పారు.

కూలి రేట్ల జీఓ విడుదల చేయాలి

లక్ష్మీపురం: రాష్ట్రంలోని సివిల్ సప్లయిస్ కార్మికుల కూలి రేట్ల జీఓని వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ఈ నెల 20 తర్వాత పూర్తి స్థాయి సమ్మెలోకి వెళ్లటానికి కార్మికులు సన్నద్ధమవుతున్నారని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా)వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు హెచ్చరించారు. స్థానిక గుంటూరు (కలెక్టర్ కార్యాలయం వద్ద) జిల్లా సివిల్ సప్లయిస్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఆంజనేయులు మాట్లాడుతూ అగ్రిమెంట్ కాల పరిమితి ముగిసి 11 నెలలు పూర్తి అవుతుందని చెప్పారు. యూనియన్‌తో జరిపిన చర్చల్లో భాగంగా జీఓని వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చిన సివిల్ సప్లయిస్ యాజమాన్యం ఇప్పటి వరకు జీఓని విడుదల చేయకపోవడం సరికాదని చెప్పారు. ప్రావిడెంట్ ఫండ్, పని భద్రతా, ఈఎస్ఐ సౌకర్యం అమలు చేయాలని కోరారు. యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు మాట్లాడుతూ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లయిస్ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కోట్ల మరియదాసు, దానం, డేవిడ్, కాంతారావు, సురేష ,బుజ్జి, జాన్ బాబు, శీను , మరియబాబు, నాగరాజు పాల్గొన్నారు.